
ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
శుక్రవారం 2 ఫిబ్రవరి 2026 www.prajaswaramdailly.com 12 AM





# అశోక్‌నగర్ వంతెన ప్రారంభం

హైదరాబాద్ , ప్రజాస్వరం
అశోక్ నగర్ లో రూ.6 కోట్లతో నిర్మించిన వంతెనను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణమన్, ఇతరులు పాల్గొన్నారు.

# కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో ఉద్రిక్తత



**బళ్లారి, ప్రజాస్వరం**
గాలి జనార్దన్ రెడ్డిపై హత్యాయత్నం జరిగిందని తెలిసింది. బళ్లారిలో ఎమ్మెల్యే భరత్ రెడి సన్నిహితుడు కాల్పులు జరిపారు. గన్‌మేన్ తుపాకీ లాక్కుని 2 రౌండ్లు సతీష్ రెడ్డి కాల్చారు. మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డి తప్పించు కున్నారు. ఇరువర్గాల పరస్పర కాల్పులు జరుపు కొన్నాయి. ఒకరు మృతి, సతీష్‌కు గాయాలయ్యాయి. బళ్లారిలో పోలీసులను భారీగా మోహరించారు. మహర్షి వాల్మీకి విగ్రహ ఏర్పాటు కొరకు ఫ్లెక్సీలు కడుతుండగా వివాదం చెలరేగింది. ఫ్లెక్సీ లు కడుతుండగా వద్దని గాలి అనుచరులు వారించారు. గాలి



జనార్దన్ రెడ్డి ఇంటికి ఫ్లెక్సీలు కట్టాలని ఎమ్మెల్యే భరత్ రెడ్డి అనుచరుడు సతీష్ రెడ్డి ప్రయత్నించారు. అక్కడే వివాదం చెలరేగింది. బళ్లారిలో 144 సెక్షన్ అమలులో ఉంది. కీలక నాయకులు ఎవరూ ఇంటి నుంచి బయటకు రాకుండా పోలీసుల బందోబస్తు చేశారు. బయట వ్యక్తులు నగరంలోకి రాకుండా పోలీస్ బందోబస్తుకొనసాగుతున్నది.

## ఎమ్మెల్యే జనార్ధన రెడ్డి సహా 11 మందిపై కేసు

బళ్లారిలోని బ్రూస్ పేట్ పోలీసు స్టేషన్‌లో బీజేపీ ఎమ్మెల్యే జనార్దన రెడ్డి సహా 11 మందిపై కేసు నమోదు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే భరత్ రెడ్డి సన్నిహితుడు ఛనల్ శేఖర్ ఫిర్యాదు మేరకు వీరిపై కేసులు నమోదయ్యాయి. ఈ ఘర్షణల కేసులోని ఎఫ్‌ఐఆర్‌లో ఏ1 నిందితుడిగా బీజేపీ ఎమ్మెల్యే జనార్దన రెడ్డి పేరును చేర్చారు. ఏ2 నిందితుడిగా సోమశేఖర్ రెడ్డి, ఏ3గా శ్రీరాములు, ఏ4గా మొత్కార్ శ్రీనివాస్ పేర్లు ఉన్నాయి.

# ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కేసు

**దుర్గం చెరువును ఆక్రమించారంటూ ఫిర్యాదు..**



హైదరాబాద్ : నగరంలోని దుర్గం చెరువును ఆక్రమించారంటూ బీఆర్ ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై కేసు నమోదైంది. హైడ్రా అధికారుల ఫిర్యాదు మేరకు మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. దుర్గం చెరువు ఎఫ్ టీఎల్ , బఫర్ జోన్ ను ఆక్రమించి పార్కింగ్ కు వాడుతున్నారని అధికారులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కొత్త ప్రభాకర్ రెడితో పాటు వెంకట్ రెడ్డి అనే వ్యక్తిపై అధికారులు ఫిర్యాదు చేశారు.

# ఆన్ లైన్ గేమింగ్ యాప్ కు యువకుడి బలి



**కామారెడ్డి, ప్రజాస్వరం**
ఆన్ లైన్ గేమింగ్ యాప్ కు యువకుడు బలి అయ్యాడు. కామారెడ్డి పట్టణంలోని ఓం శాంతి కాలనీకి చెందిన వల్లందేసి శ్రీకర్ (30) ఏడాదిన్నర కాలంగా ఆన్ లైన్ గేమింగ్ కు అలవాటు పడ్డాడు. దాదాపు రూ.20 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీకర మృతితో కుటుంబంలో విషాద ఛాయలు అలుము కున్నాయి. కేసు నమోదు చేసి పోలీసులుదర్యాప్తు చేపట్టారు.

# అబద్దాల పోటీలు నిర్వహిస్తే.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు అవార్డు ఖాయం

**299 టీఎంసీలు చాలని ఒప్పందం చేసుకున్నది కేసీఆర్**



**హైదరాబాద్, ప్రజాస్వరం**
మీ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కేంద్రంపై బురదజల్లుతారా? అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. అబద్దాల పోటీలు నిర్వహిస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అవారులు ఖాయం అని ఎద్దేవా చేశారు. 811 టీఎంసీల కృష్ణా జలాలో తెలంగాణకు కేవలం 299 టీఎంసీలు చాలని ఒప్పందం చేసుకున్నదే కేసీఆర్.. తెలంగాణకు రావాల్సిన వాటాను ఏపీకి ధారాదత్తం చేసిందే కేసీఆర్ అని విమర్శించారు. యూపీఏ సర్కార్ చేసిన విభజన చట్టం పరిమితుల వల్లే తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. తెలంగాణకు కాంగ్రెస్ చేసిన అన్యాయాన్ని మోడీ ప్రభుత్వం సరిదిద్దిందని బండి సంజయ్ అన్నారు.




# 10 కిలో మీటర్ల.. వరకు ట్రాఫిక్ జాం

**హైదరాబాద్ - బెంగళూరు హైవేపై నాలుగు లారీలు ఢీ**

హైదరాబాద్, ప్రజాస్వరం
పది కిలో మీటర్ల వరకు ట్రాఫిక్ జాం ఏర్పడింది. నగర శివారు ప్రాంతాల్లో భారీగా పొగమంచు కారణంగా హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్- బెంగళూరు హైవేలపై దట్టంగా అలముకోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పొగమంచుతో హైదరాబాద్-బెంగళూరు హైవేపై నాలుగు లారీలు పరస్పరం ఢీకొన్నాయి. దీంతో ట్రాఫిక్ జామ్ అయింది. పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. శంషాబాద్ నుంచి పాలమాకుల వరకు సుమారు 10 కి.మీ మేర ట్రాఫిక్ స్తంభించి పోయింది. ఔటర్ రింగ్ రోడ్డుపైనా పొగమంచుతో ఇబ్బందులు పడుతున్నారు.

- పొగమంచు కారణంగా హైదరాబాద్-విజయవాడ హైవేపై వాహనాలు నెమ్మదిగా సాగుతున్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్-ఘట్‌కేసర్ బైపాస్ మార్గంలో పది అడుగుల దూరంలోని వాహనాలు కూడా కనిపించడం లేదు. సూర్యోదయం తర్వాత కూడా పొగమంచు దట్టంగా అలముకుంది. ఇంతగా ఎప్పుడూ చూడలేదని వాహనదారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

# రూ.4,100 కోట్లతో మూసీ ప్రాజెక్టు

**ఉస్మాన్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు అభివృద్ధి**

**ఐదు జోన్లుగా మూసీ అభివృద్ధి ప్రాజెక్టు విభజన**

**మొదటి దశలో 55 కి.మీ మేర అభివృద్ధి**



**హైదరాబాద్, ప్రజాస్వరం**
రూ.4,100 కోట్లతో ఎంఆర్ డీసీఎల్ మూసీ ప్రాజెక్టు చేపట్టనున్నది. ఉస్మాన్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు మూసీ అభివృద్ధి జరగనుంది. మొదటి దశలో 55 కి.మీ మేర అభివృద్ధి చేయనున్నారు. గాంధీ సరోవర్ అభివృద్ధి చేయాలనే ప్రతిపాదన కూడా ఉంది. ఐదు జోన్లుగా మూసీ అభివృద్ధి ప్రాజెక్టు విభజన చూశారు. తెలంగాణ అసెంబ్లీలో కొనసాగుతున్న ప్రశ్నోత్తరాలు సమయంలో మూసీ పునర్జీవనం ప్రాజెక్టు పై చర్చ కొనసాగుతున్నది.

# ఇంజినీరింగ్ కాలేజీ బస్సు బోల్తా పలువురికి గాయాలు



**అశ్వాపురం, ప్రజాస్వరం**
ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాల బస్సు బోల్తా పడింది. పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. అశ్వాపురం మండలం మొండికుంట వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. కేఎల్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన మణుగూరు నుంచి పాల్వంచకు వెళ్తుండగా మొండికుంటలోని సాయిబాబా ఆలయం సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో 60 మంది విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. వీరిలో పలువురికి గాయాలయ్యాయి. కొందరికి తీవ్రగాయాలు కావడంతో వారిని భద్రాచలంలోని ఆస్పత్రికి తరలించారు. అశ్వాపురం సీఐ అక్కడికి చేరుకుని పరిశీలించారు.